సాక్షి అనకాపల్లి

సోమవారం । 21 । జూలై । 2025

ధ్యానంపై పెరుగుతున్న ధ్యాస


శ్వాసపై ధ్యాస పెరిగితే మానసిక ప్రశాంతత పెరుగుతుంది. చాలా సమస్యలను అధిగమించవచ్చునని పిరమిడ్ ధ్యాన కేంద్రం మాస్టర్‌లు సూచిస్తున్నారు.



8లో

ఘనంగా మోదమాంబ జాతర

కె.జె.పురంలో మోదమాంబ జాతర ఆదివారం వైభవంగా జరిగింది. ఉదయం నుంచి భక్తులు అమ్మవారి దర్శనం కోసం బారులు తీరారు.



8లో



మార్మోగిన హరినామస్మరణ

కొమ్మాది: ఇస్కాన్ మందిరం ఆదివారం హరినామస్మరణతో మార్మోగింది. ప్రత్యేక పూజలు నిర్వహించారు.

న్యూస్‌రీల్

తాండవ నీటి విడుదలపై నేడు సమావేశం

- తాండవ ప్రాజెక్టు డీఈ అనురాధ



తాండవ రిజర్వాయరు

నాతవరం: ఖరీఫ్ సాగుకు తాండవ రిజర్వాయరు నీటిని విడుదల చేయడం కోసం ఆయకట్టుదారులు, ప్రజాప్రతినిధులతో సోమవారం నాతవరంలో సమావేశం ఏర్పాటు చేస్తున్నట్టు ప్రాజెక్టు డీఈ అనురాధ తెలిపారు. ఆమె విలేకరులతో మాట్లాడుతూ తాండవ రిజర్వాయర్ నుంచి నీటిని విడుదల కోసం ఏటా జూలైలో సమావేశం ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో ప్రాజెక్టు కమిటీ చైర్మన్, కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, ఆయకట్టుదారుల అభిప్రాయాలు తెలుసుకుని, వారి అభీష్టం మేరకు నీటిని విడుదల చేసేందుకు తేదీ ఖరారు చేస్తామన్నారు. తాండవ ప్రాజెక్టులో ఆదివారం సాయంత్రానికి 369.0 అడుగుల నీటి మట్టం ఉందన్నారు. తాండవ రిజర్వాయర్ ప్రమాద స్థాయి నీటి మట్టం 380.0 అడుగులు కాగా డెడ్ స్టోరేజీ నీటి మట్టం 345.0 అడుగులు. తాండవ ప్రాజెక్టులో ఉన్న నీటిమట్టం బట్టి ఎప్పుడు నీటిని విడుదల చేయాలో నిర్ణయిస్తారన్నారు. సాధారణంగా ఏటా ఖరీఫ్‌లో తాండవ ప్రాజెక్టు నీటిని ఆగస్టులో విడుదల చేయడం జరుగుతుందని, ఈ ఏడాది ఎప్పుడనేది సమావేశంలో తీర్మానిస్తారని తెలిపారు. సమావేశంలో నర్సీపట్నం, పాయకరావుపేట, తుని, ప్రత్తిపాడు నియోజకవర్గాల నుంచి ఆయకట్టుదారులు పాల్గొంటారని చెప్పారు.

రేపు మధ్యాహ్నం 2.30 గంటల వరకే అప్పన్న దర్శనాలు

సింహాచలం: వరాహ లక్ష్మీనృసింహస్వామి దర్శనాలు మంగళవారం మధ్యాహ్నం 2.30 గంటల వరకు మాత్రమే లభిస్తాయని సింహాచలం దేవస్థానం ఈవో వి.త్రినాథరావు తెలిపారు. సింహగిరి గ్రామదేవతలు పాదాలమ్మ, బంగారమ్మ పండగ సందర్భంగా ఈ మార్పు చేసినట్టు పేర్కొన్నారు. తిరిగి బుధవారం ఉదయం 6.30 గంటల నుంచి యథావిధిగా స్వామి వారి దర్శనాలు లభిస్తాయని వెల్లడించారు. భక్తులంతా ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

ఎస్‌బీఐ ఉపాధి శిక్షణ డైరెక్టర్‌గా రాజేశ్వరరావు



అనకాపల్లి: ఉమ్మడి విశాఖ జిల్లా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ డైరెక్టర్‌గా సీహెచ్.రాజేశ్వరరావు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. కాకినాడ జిల్లా పెద్దాపురం ఎస్‌బీఐ నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ విధులు నిర్వహించిన బి.విజయకుమార్ రాజమహేంద్రవరంలో ఎస్‌బీఐ ఆర్‌బీవో కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో గ్రామీణ ప్రాంతానికి చెందిన నిరుద్యోగ మహిళలకు వచ్చేనెల 2 నుంచి సెప్టెంబర్ 1 వరకూ టైలరింగ్, వచ్చేనెల 9 నుంచి సెప్టెంబర్ 9వ తేదీ వరకూ ఎంబ్రాయిడరీ, ఫ్యాబ్రిక్ పెయింటింగ్ (మగ్గం వర్క్)లో ఉదయం 9.30 నుంచి సాయంత్రం 5.30 వరకూ ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్టు రాజేశ్వరరావు తెలిపారు. శిక్షణ సమయంలో ఉచిత భోజనం, వసతి సౌకర్యాలు కల్పించనున్నట్టు చెప్పారు. మరిన్ని వివరాలకు 8008333509 అనే ఫోన్ నంబరులో సంప్రదించాలని ఆయన కోరారు.

వాక్ ఇన్ డ్రైవ్‌లో 24 మంది ఎంపిక



వాక్ ఇన్ డ్రైవ్‌లో పాల్గొన్న నిరుద్యోగ యువత

పరవాడ: జేఎన్ ఫార్మాసిటీలో కోహన్స్ లైఫ్ సైన్సెస్ పరిశ్రమ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెంలో ఆదివారం వాక్ ఇన్ డ్రైవ్‌ను నిర్వహించారు. ఈ వాక్ ఇన్ డ్రైవ్ కార్యక్రమంలో పరవాడ, అచ్యుతాపురం, జగ్గయ్యపేట ప్రాంతాల్లో నడుస్తున్న కోహన్స్ లైఫ్ సైన్సెస్ ఉత్పత్తి కేంద్రాల్లో ప్రొడక్షన్ బ్లాక్‌లో పనిచేయడానికి ప్రతిభ, అనుభవం కలిగిన తాజా బీఎస్సీ అభ్యర్థుల నుంచి నేషనల్ అప్రెంటిస్‌షిప్ ట్రైనింగ్ స్కీం(ఎన్‌ఏటీఎస్) కింద దరఖాస్తులను స్వీకరించారు. ఈ వాక్ ఇన్ డ్రైవ్ ప్రోగ్రాంలో వివిధ ప్రాంతాల నుంచి 116 మంది అభ్యర్థులు హాజరుకాగా వారిలో 24 మందిని ఎంపిక చేశారు. వారిలో 6గురు మహిళా అభ్యర్థులను ఎంపిక చేయడం జరిగిందని యాజమాన్య ప్రతినిధులు, టాలెంట్ అక్విజిషన్ హెడ్ వంశీధర్ చెప్పారు. ఈ ఇంటర్వ్యూలను ఏపీఐ యూనిట్-1 హెచ్‌ఆర్ హెడ్ సురేష్, టెక్నికల్ హెచ్‌ఆర్ టీం సభ్యులు నిర్వహించారు.

ఉపాధి కూలీల వేతన వెతలు



దేవరాపల్లిలో నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధి కూలీలు

ఎండను లెక్కచేయకుండా పనులు చేస్తున్న ఉపాధి కార్మికులకు నిరాశే మిగులుతోంది. ఉపాధి హామీ పథకం కింద ..ఉన్న ఊరిలో ఉపాధి దొరికినా చేసిన పనికి సకాలంలో వేతనాలందక కూలీలు అవస్థలు పడుతున్నారు. కుటుంబ పోషణ భారంగా మారుతోంది. రెండు పూటలా పనులకెళ్లి చెమటను చిందిస్తున్నా డబ్బులు రావడం లేదని పలువురు ఉపాధి కూలీలు వాపోతున్నారు. వేతనం రాని పనులకు వెళ్లేకంటే వలస వెళ్లడమే మేలని కొందరు ఉపాధి **పనుల పట్ల ఆసక్తి చూపడం లేదు. వ్యవసాయ కూలీలకు పనులు కల్పించడం, వలసల నివారణే లక్ష్యంగా చేపట్టిన ఈ పథకం ఉద్దేశం నీరుగారుతోంది. చేసిన పనికి వారం రోజుల్లో వేతనం చెల్లించాలన్న నిబంధన అమలుకు నోచుకోవడం లేదు.**





ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

సాక్షి, అనకాపల్లి: వేసవి కాలంలో చేసిన మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం(ఎన్‌ఆర్‌ఈజీఎస్)పనులకు ఇంకా వేతన బకాయిలను విడుదల చేయలేదు. ఈ ఏడాదిలో జనవరి నెలాఖరు నుంచి జూన్ వరకూ సుమారు 11 వారాల వేతనాలు ఇవ్వాల్సి ఉండగా..ఐదు వారాల వేతనాలను మాత్రమే ప్రభుత్వం విడుదల చేసింది. ఆరు వారాల పాటు చేసిన పనికి వేతన బకాయిలు చెల్లించవలసి ఉంది. జనవరి నుంచి జూన్ నెల వరకూ వ్యవసాయ పనులు లేకపోవడంతో వేతనదారులు ఉపాధి పనుల బాట పట్టారు. వీరికి నెలల తరబడి వేతన బకాయిలు పడకపోవడంతో పలు ఇబ్బందులకు గురవుతున్నారు. డబ్బుల కోసం కూలీలు కళ్లు కాయలు కాసేలా ఎదురుచూడగా సుమారు ఐదు వారాల బకాయిలు మాత్రమే విడుదల చేశారు. ఆరు వారాల డబ్బులు ఇంకా పడలేదు. రోజంతా మట్టిలో స్వేదం చిందిస్తే రూ.250 నుంచి రూ.300లకు మించి కూలి రావడంలేదు. అయినా తప్పనిసరి పరిస్థితుల్లో పనులకు వెళితే వేతనాలు సకాలంలో చెల్లించడం లేదు. పనిచేసిన వారం రోజుల్లో కూలి డబ్బులు చెల్లించాలి. ఒకవేళ ఆలస్యమైనా గరిష్ఠంగా 15 రోజుల్లోగా వేతనాలు చెల్లించాలి. ఆ తర్వాత చెల్లిస్తే వడ్డీతో సహా జమచేయాలని చట్టం చెబుతోంది. కానీ, పనులు చేసి నెలలు గడుస్తున్నా వేతనాలు అందడం లేదు. దీంతో తమ ఇంటి ఖర్చులు తీరేదెలా అంటూ కూలీలు తల్లడిల్లుతున్నారు. జిల్లాలో **24మండల పరిధిలో సుమారురూ.24 కోట్ల ఉపాధి వేతన బకాయిలను చెల్లించాల్సి ఉంది.**

ఎస్.రాయవరంలో అధికం..

అనకాపల్లి జిల్లాను నాలుగు క్లస్టర్లుగా విభజించారు. ఒక్కో క్లస్టర్ పరిధిలో 6 మండలాలున్నాయి. నాలుగు క్లస్టర్ల పరిధిలో ఉన్న 24 మండలాల పరిధిలో ఉపాధి పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఎస్.రాయవరం మండలంలో కూలీలకు అత్యధికంగా బకాయిలు రావల్సి ఉండగా..అచ్యుతాపురం, మాకవరపాలెం, పరవాడ మండలాల్లో అత్యల్పంగా వేతన బకాయిలు రావాల్సి ఉంది.

నగటున రూ.14 వేల వరకూ బకాయిలు

ఒక్కో కూలీకి సగటున రూ.13 వేల నుంచి రూ.14 వేల వరకూ ప్రభుత్వం బకాయి చెల్లించాల్సి ఉంది. ఖరీఫ్ సీజన్ ప్రారంభమవడంతో ఉపాధి పనులు తగ్గాయి. ప్రస్తుతం పంట కాలువ పూడికతీత, పిచ్చి మొక్కల తొలగింపు తదితర పనులు చేయాల్సి ఉంటుంది. ప్రభుత్వం సకాలంలో వేతనాలు చెల్లించకపోవడంతో ఉపాధి పనులకు వెళ్లేందుకు కూలీలు ఆసక్తి చూపడం లేదు. జిల్లాలో ఎంఎన్‌ఆర్ జీఎస్ అమలులో భాగంగా 2,81,075 జాబ్ కార్డులు జారీ చేశారు. అందులో పనులకు హాజరయ్యే యాక్టీవ్ జాబ్ కార్డులు 2,02,924 వరకు ఉన్నాయి. ఈ కార్డుల్లో నమోదైనవారిలో 2,07,896 మంది కూలీలు ఉపాధి పనులకు హాజరవుతున్నారు. రోజుకు సగటున లక్ష మందికి పైగా హాజరవుతున్నట్లు డ్వామా రికార్డుల ద్వారా తెలుస్తోంది.

డిప్యూటీ సీఎం ఎందుకు పట్టించుకోవడం లేదు



ఉపాధి హామీ వేతన బకాయిలను తక్షణమే చెల్లించాలి. సకాలంలో బకాయిలు చెల్లించని సంబంధిత శాఖపై కూలీలు కేసులు పెట్టే అవకాశం చట్టంలో ఉంది. ఆ పరిస్థితి రాక ముందే తక్షణమే బకాయిలు చెల్లించాలి. ఉపాధి హామీ **శాఖకు డిప్యూటీ** సీఎం పవన్ కల్యాణ్ మం**త్రిగా ఉండి కూలీ**ల కష్టాన్ని అర్థం చేసు**కోకపోవడం విచార**కరం. ఉపాధి హామీకి లక్ష **కోట్లు ఉన్న బడ్జెట్**ను పీఎం మోదీ ప్రభుత్వం **దశలవారీగా రూ.** 62 వేల కోట్లకు తగ్గించిం**ది. గట్టిగా ఉన్న** నేలకు అదనంగా డబ్బులు **ఇవ్వాలి.**

– డి.వెంకన్న, **ఏపీ వ్యవసాయి** కార్మిక సంఘం కార్యదర్శి

వేతన బకాయిలు విడుదల చేయాలి



ఉపాధి హామీ కార్మికుల ఆరు వారాల బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలి. ఉపాధి హామీ పని చేస్తున్న కార్మికులకు మంచినీరు, మజ్జిగ సదుపాయం కల్పించడంతో పాటు పార, తట్ట, గునపాలకు డబ్బులు చెల్లించాలి. కొలతలతో సంబంధం లేకుండా ప్రభుత్వం ప్రకటించిన జీవో ప్రకారం రూ.309 వేతనం చెల్లించాలి. లైవ్ ఆడిట్ పేరుతో ఉపాధి హామీ కార్మికులను వేధింపులకు గురి చేసే విధానం మానుకోవాలి.

– గనిశెట్టి సత్యనారాయణ, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు

స్మార్ట్ మీటర్ల ఏర్పాటుపై అపోహలొద్దు

ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి



సాక్షి, విశాఖపట్నం : స్మార్ట్ మీటర్ల ఏర్పాటు విషయంలో ఎలాంటి అపోహలు అవసరం లేదని, వీటితో వినియోగదారులపై అదనపు భారం ఉండే అవకాశమే లేదని ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి స్పష్టం చేశారు. స్మార్ట్ మీటర్ల ప్రక్రియ విషయంలో వస్తున్న వదంతులపై ఆయన స్పందిస్తూ.. ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. విద్యుత్ వినియోగదారుల సేవల్లో పారదర్శకతను మరింత పెంచేందుకు ఆర్డీఎస్ఎస్ పథకంలో భాగంగా రాష్ట్రంలో స్మార్ట్ మీటర్ల ఏర్పాటు జరుగుతోందని పేర్కొన్నారు. ఏపీఈఆర్సీ రెగ్యులేషన్ ప్రకారం ప్రభుత్వ, వాణిజ్య కేటగిరీల వినియోగదారులకు ప్రస్తుతం వీటిని అమర్చుతున్నామన్నారు. వీటితోపాటు ఎక్కువ విద్యుత్ వినియోగం కలిగిన (హై వేల్యూ) గృహ వినియోగదారులకు కూడా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. స్మార్ట్ మీటర్ ఏర్పాటు సమయంలో వినియోగదారులు వాటి ఖరీదు, ఛార్జీలు కానీ, మామూళ్లు కానీ చెల్లించవలసిన అవసరం లేదని సీఎండి తెలిపారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటు వల్ల వినియోగదారులపై విపరీత భారాలు పడతాయనే ఆందోళన అవసరం లేదన్నారు. స్మార్ట్ మీటర్లు పాత మీటర్ల కంటే ఎక్కువ విద్యుత్ వినియోగాన్ని నమోదు చేయవని, వీటి కారణంగా బిల్లులు పెరిగే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. పాత మీటర్లతో పోలిస్తే స్మార్ట్ మీటర్ల ద్వారా మరింత పారదర్శకత పెరుగుతుందని పేర్కొన్నారు. ఏపీఈఆర్సీ నిర్ణయించిన టారిఫ్ ప్రకారమే విద్యుత్ బిల్లులు వసూలు చేస్తామని పేర్కొన్నారు. బిల్లు వివరాలను నేరుగా వినియోగదారుని మొబైల్ కు చేరవేస్తామని చెప్పారు. వినియోగం, ఖర్చుపై పూర్తి నియంత్రణ వినియోగదారుల చేతుల్లో ఉండటం వలన విద్యుత్ వినియోగాన్ని మెరుగ్గా ప్లాన్ చేయడంలో స్మార్ట్ మీటర్లు సహాయకరిస్తాయన్నారు. ఈ విషయంలో ఎలాంటి సందేహం ఉన్నా.. టోల్ ఫ్రీ నం.1912కి సంప్రదించాలని సీఎండీ పృథ్వీతేజ్ ప్రకటనలో సూచించారు.

పాలిసెట్ వెబ్ ఆప్షన్ల మార్పిడి గడువు పొడిగింపు



పాలిసెట్ కౌన్సెలింగ్‌లో పాల్గొన్న విద్యార్థులు

మురళీనగర్(విశాఖ):పాలిటెక్నిక్ కాలేజీల్లో ప్రవేశాల కోసం నిర్వహిస్తున్న పాలిసెట్ చివరి దశ కౌన్సెలింగ్ గడువు సోమవారంతో ముగుస్తుంది. వాస్తవానికి ఈనెల18న ప్రారంభమైన ఆప్షన్ల మార్పిడి ఆదివారంతో ముగిసినప్పటికీ, గడువును సోమవారానికి పొడిగించారు. అభ్యర్థులు వెబ్ ఆప్షన్ల ఎంపిక, మార్పిడిని సోమవారం సాయంత్రంలోగా చేసుకోవాల్సి ఉంటుంది. వీరికి జూలై 23న సీట్ల కేటాయింపు జరుగుతుంది. ఆన్‌లైన్ రిపోర్టింగ్ జూలై 24 నుంచి 27 వరకు ఉంటుంది. పాలిసెట్ రెండో దశలో 160 మంది మాత్రమే నమోదు చేసుకోగా, మొదటి కౌన్సిలింగ్‌లో 2040 మంది నమోదు చేసుకున్నారు.

ఈసెట్ కౌన్సెలింగ్ : ఈసెట్ రెండో దశ కౌన్సిలింగ్ ఈ నెల 18న ప్రారంభమైంది. వెబ్‌ఆప్షన్ల మార్పిడి సోమవారంతో ముగుస్తుంది. కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో నిర్వహించిన మొదటి దశ ఈసెట్ కౌన్సెలింగ్‌లో 1400 మంది, రెండో దశలో 135 మంది ఆదాయ ధ్రువపత్రాలు, ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్లను పరిశీలన చేయించుకున్నారు. వీరి కౌన్సెలింగ్ సోమవారంతో ముగుస్తుంది. ఈసెట్‌లో ఇంజినీరింగ్ రెండో సంవత్సరం ప్రవేశాలకు సంబంధించి జూలై 22న సీట్లు కేటాయిస్తారు. ఆన్‌లైన్ సెల్ఫ్ జాయినింగ్ జూలై 23 నుంచి 25వ తేదీలోగా ఆయా కాలేజీలకు రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది. ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ కె. రత్నకుమార్ పర్యవేక్షణలో సిస్టమ్ అడ్మిన్ ఎస్. నాగరాజు కౌన్సెలింగ్‌కు సహకరించారు.

రాష్ట్ర స్విమ్మింగ్ ఓవరాల్‌చాంప్ విశాఖ



ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించిన విశాఖ జట్టు

- రన్నరప్స్‌గా ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలు
- వ్యక్తిగత చాంప్‌లు స్వామి, పార్థవి, పృథ్వీ, యానా

విశాఖ స్పోర్ట్స్: పదవ ఏపీ సబ్‌జూనియర్, జూనియర్ అక్వాటిక్ చాంపియన్‌షిప్‌ను విశాఖ జట్టు సాధించాయి. ఫస్టరన్నరప్‌గా ఎన్టీఆర్, సెకండ్ రన్నరప్‌గా కృష్ణాజిల్లా జట్లు నిలిచాయి. విశాఖ సాగరతీరంలోని అక్వాస్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఆదివారంతో ముగిసిన ఈ చాంపియన్‌షిప్‌లో గ్రూప్ 3 బాలురలో బి.స్వామి(ఏలూరు) బాలికల్లో వై.పార్థవి(కృష్ణా), గ్రూప్ 2 బాలురలో బి.పృథ్వీరాజ్, బాలికల్లో యానాజైన్(వీరిద్దరూ ఎన్టీఆర్) వ్యక్తిగత చాంప్‌లుగా నిలిచారు. గ్రూప్‌లో 1 బాలురలో జె.గణేష్‌చక్రధర్(విశాఖ),పి.అవినాష్(శ్రీకాకుళం),ఎస్.కార్తీకేయ(అనంతపురం)లు సముజ్జీలుగా నిలిచి వ్యక్తిగత చాంప్‌లను పంచుకోగా బాలికల్లో ఎస్.పావని శరయు(ఎన్టీఆర్) వ్యక్తిగత చాంప్‌లుగా నిలిచారు. ఈ చాంపియన్‌షిప్‌లో మూడు గ్రూప్ కాటగిరిల్లో బాలబాలికలకు ఫ్రీస్టయిల్, బ్యాక్‌స్ట్రోక్, బ్రెస్ట్ స్ట్రోక్, బటర్‌ఫ్లై అంశాలతో పాటు ఇండివిడ్యువల్ మెడ్లే నిర్వహించారు. ఓవరాల్ చాంపియన్‌షిప్‌లో విశాఖ జిల్లా జట్టు 15 స్వర్ణాలు, 27 రజతాలు, 23 కాంస్యాలతో 179 పాయింట్లు సాధించి ఆధిక్యంలో నిలిచాయి. ఎన్టీఆర్ జిల్లా జట్టు 22 స్వర్ణాలు, 12కాంస్యాలు, 9 రజతాలతో మొత్తంగా 155 పాయింట్లతో రన్నరప్‌గా, కృష్ణాజిల్లా జట్టు 9 స్వర్ణాలు, 12 కాంస్యాలు, 15 రజత పతకాలతో మొత్తంగా 90 పాయింట్లతో సెకండ్ రన్నరప్‌గా నిలిచాయి. గుంటూరు, ఏలూరు, బాపట్ల, అనంతపురం, శ్రీకాకుళం, కాకినాడ, వైఎస్ఆర్ కడప జిల్లా జట్లు టాప్‌టెన్‌లో నిలిచాయి. విజయనగరం జిల్లా జట్టు మూడు స్వర్ణాలు(5 కాంస్యాలు) సాధించినా మొత్తంగా 20 పాయింట్లే సాధించగలగడంతో 12వ స్థానంతో సరిపుచ్చింది. కర్నూలు జిల్లా జట్టు స్వర్ణాలు సాధించలేకపోయినా ఆరు రజతాలు, మూడు కాంస్యాలతో 21 పాయింట్లతో పదకొండోస్థానానికి చేరుకుంది. జిల్లా స్విమ్మింగ్ సంఘం అధ్యక్ష కార్యదర్శులు సంతోష్, వెంకట్‌రామ్ తదితరులు విజేతలకు బహుమతులందించారు.



ఉమ్మడి చాంప్స్ గణేష్, అవినాష్, కార్తికేయ



గ్రూప్ వన్ బాలికల చాంప్ పావని

శాకంబరీ దేవిగా నూకాంబిక



పద్మనాభరాజుపేటలో శాకంబరి అలంకరణలో నూకాంబిక అమ్మవారు



శాకంబరీ దేవిగా అనకాపల్లి నూకాంబిక అమ్మవారు

అనకాపల్లి : ఆషాఢ మాసం దశమి ఆదివారం సందర్భంగా కూరగాయల వ్యాపారవేత్త మళ్ల జగ్గప్పారావు ఆర్థిక సాయంతో ఉత్తరాంధ్ర ఇలవేల్పు, స్థానిక గవరపాలెం నూకాంబిక అమ్మవారి దేవస్థానంలో అమ్మవారిని శాకంబరీ దేవిగా ఆలయ అర్చకులు అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో కె.ఎల్.సుధారాణి మాట్లాడుతూ సోమ, మంగళవారాల్లో అమ్మవారు శాకంబరీ దేవిగా భక్తులకు దర్శనమిస్తారని చెప్పారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. ఉత్సవ కమిటీ మాజీ చైర్మన్ పీలా నాగశ్రీను తదితరులు పాల్గొన్నారు.

యలమంచిలి రూరల్: పద్మనాభరాజుపేట గ్రామంలో నూకాంబిక అమ్మవారికి శాకంబరి అలంకరణ చేశారు. సుమారు 20 రకాలకు పైగా కూరగాయలు, ఆకుకూరలు, వివిధ రకాల పండ్లతో అమ్మవారిని అలంకరించారు. పద్మనాభరాజుపేట, బయ్యవరం గ్రామాల ప్రజలు అమ్మవారిని పెద్ద సంఖ్యలో దర్శించుకుని పూజలు చేశారు. గ్రామ పెద్ద ఎడ్ల శ్రీనుబాబు ఆర్థిక సాయంతో భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. హరిభజన బృందాల గురువులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



అనకాపల్లిలో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

చిట్టీల పేరుతో మోసగించిన టీడీపీ నేతకు రిమాండ్



పైడియ్య

యలమంచిలి రూరల్: మున్సిపాలిటీ పరిధి తెరువుపల్లిలో అనధికారికంగా చిట్టీలు నిర్వహించడంతో పాటు అధిక వడ్డీ ఆశ చూపి పలువురి నుంచి పెద్ద మొత్తంలో డబ్బుతీసుకుని మోసగించిన టీడీపీ నాయకుడు దాడిశెట్టి పైడియ్య(నానాజీ)ను విశాఖ కేంద్ర కారాగారానికి రిమాండ్‌కు తరలించినట్టు యలమంచిలి రూరల్ ఎస్ఐ ఎం ఉపేంద్ర తెలిపారు.వందల సంఖ్యలో బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడు పైడియ్యపై గత నెల 27న బడ్స్ యాక్ట్ సెక్షన్ 21 క్లాజ్ (1),(2),(3),బీఎన్ఎస్ యాక్ట్ 318 క్లాజ్ (4) ప్రకారం కేసు నమోదు చేశారు. పరారీలో ఉన్న నిందితుడ్ని శనివారం కొక్కిరాపల్లి హైవే కూడలి వద్ద పోలీసులు అరెస్ట్ చేసి యలమంచిలి ఏజేఎఫ్‌సీఎం కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి... నిందితుడికి జ్యుడీషియల్ రిమాండ్ విధించారు.ఈ మేరకు టీడీపీ నేత దాడిశెట్టి పైడియ్యను అడవివరం సెంట్రల్ జైలుకు తరలించారు.300 మందికి పైగా బాధితులు ఉండడంతో వారంతా నిందితుడికి ఇచ్చిన తమ డబ్బు తిరిగి చేతికి వస్తుందో?రాదోనన్న ఆందోళనలో ఉన్నారు.

భద్రతా ప్రమాణాలపై ట్రాలీమెన్‌లకు అవగాహన



మాట్లాడుతున్న వాల్తేర్ డివిజన్ సీనియర్ డీఈఎన్ నవీన్‌రాజు

తాటిచెట్లపాలెం(విశాఖ): వాల్తేర్ డివిజన్, ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో పుష్ ట్రాలీ, మోటార్ ట్రాలీ, మోపెడ్ ట్రాలీల పనితీరుపై డీఆర్‌ఎం కార్యాలయం సమీపంలోని డివిజనల్ పీవే శిక్షణ కేంద్రంలో ఆదివారం సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ డీఈఎన్ (సౌత్) బి.నవీన్ రాజు.. ప్లెయిన్, ఘాట్ సెక్షన్లలో పుష్, మోటార్, మోపెడ్ ట్రాలీలకు సంబంధించిన విధివిధానాలను వివరించారు. ట్రాలీమెన్ వీటి విధి విధానాలను పూర్తిగా అర్థం చేసుకోవాలని సూచించారు. వీటిని వినియోగించే ముందుగా ట్రాలీ పరికరాలు, బ్రేకులు, ప్రతి దానినీ క్షుణ్ణంగా పరీక్షించుకోవాలని స్పష్టం చేశారు. సీనియర్ డీఈఎన్ (ఈస్ట్) బి.సాయిరాజు మాట్లాడుతూ ప్రధాన ట్రాలీమెన్ సమక్షంలో నలుగురు సుశిక్షితులైన ట్రాలీమెన్‌లు ట్రాలీలను వినియోగించాలని, కచ్చితంగా సూచనలు పాటించాలన్నారు. ట్రాక్‌లపై వెళ్తున్నప్పుడు స్టేషన్ల వద్ద ఆయా సమయాల్లో రిపోర్టింగ్ తీసుకునే హెడ్ ట్రాలీమెన్‌లు తప్ప మరెవరూ మొబైల్ ఫోన్లు వినియోగించరాదని హెచ్చరించారు. ట్రాలీల నిర్వహణ సమయంలో సిబ్బంది అత్యంత జాగరూకతతో వ్యవహరిస్తూ, భద్రతకు ప్రాధాన్యమివ్వాలన్నారు. సెమినార్ అనంతరం సీనియర్ డీఈఎన్‌లు, ఏడీఈఎన్లు కేజీపీ రాజు, ఎస్.కె.సింగ్, ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ ప్రిన్సిపాల్ సత్యనారాయణలతో కలిసి మోడల్ రూమ్, మోడల్ ట్రాక్‌రూమ్, డెమో ట్రాక్‌లను పరీక్షించారు.

క్లుప్తంగా

కుళ్లిన మాంసం విక్రయం నిలుపుదల



కొత్తూరు జాతీయ రహదారిలో కుళ్లిన మాంసం అమ్ముతున్న వ్యాపారి

అనకాపల్లి: మండలంలోని కొత్తూరు పంచాయతీ పరిధిలో కాలేజీ జంక్షన్ వద్ద కుళ్లిన మాంసం విక్రయాలు నిలిపివేశారు. ఆదివారం ఇక్కడ కుళ్లిన మాంసం విక్రయిస్తుండగా స్థానికులు, వార్డు మెంబర్లు ఎంపీహెచ్ఈవో సత్యనారాయణకు ఫోన్లో ఫిర్యాదు చేశారు. వెంటనే ఆయన ఆదేశాల మేరకు పంచాయతీ మెడికల్ సిబ్బంది వచ్చి మాంసం పరిశీలించి విక్రయాలను నిలుపుదల చేశారు. ఈ సందర్భంగా కొత్తూరు సర్పంచ్ సప్పారపు లక్ష్మీ ప్రసన్న మాట్లాడుతూ మాంసం కొనుగోలు సమయంలో ప్రభుత్వ ముద్ర ఉన్నది లేనిదీ చూడాలని కొనుగోలుదారులకు సూచించారు.

7 నుంచి శ్రీమన్నారాయణ యాగం



మాట్లాడుతున్న శ్రీరామాచార్యులు

బీచ్‌రోడ్డు: ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ సనాతన ధర్మ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, మహా మండలేశ్వర్ అనంత విభూషిత నారాయణానందగిరి మహారాజ్ ఆధ్వర్యంలో ఆగస్టు 7 నుంచి 10వ తేదీ వరకు అష్టోత్తర శత కుండాత్మక శ్రీ మహాలక్ష్మి సమేత శ్రీమన్నారాయణ యాగం నిర్వహించనున్నట్లు అర్చక ఎగ్జామినర్ రేజేటి శ్రీరామాచార్యులు తెలిపారు. దసపల్లా హిల్స్ వద్ద గల పోర్టు గెస్ట్ హౌస్‌లో ఆదివారం ఆయన ఈ యాగం వివరాలను మీడియాకు వెల్లడించారు. ప్రస్తుత సమాజంలో నెలకొన్న విపత్తులను నివారించి.. విశ్వశాంతిని నెలకొల్పేందుకు నారాయణానందగిరి మహారాజ్ దేశవ్యాప్తంగా 12 యాగాలు చేయాలని సంకల్పించారన్నారు. ఇందులో మొదటిది దసపల్లా హిల్స్ వద్ద పోర్ట్ గెస్ట్ హౌస్ ఎదురుగా ఉన్న ఏపీఐఐసీ గ్రౌండ్స్‌లో 7 నుంచి నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. 7వ తేదీ సాయంత్రం పసుపు కుంకుమల కలశాలతో మహిళలు, వివిధ వాయిద్య కళాకారులతో కూడిన లక్ష్మీనారాయణుల శోభాయాత్ర, 8న యాగశాల ప్రాంగణంలో ఏర్పాటుచేసే నమూనా ఆలయంలో సుప్రభాత సేవ, వేదపారాయణం, సువర్ణ పుష్పార్చన, విష్వక్సేన పూజ, గరుడ పతాక ప్రతిష్టాపన, దీక్షా వస్త్రధారణ, యాగశాలలో అగ్నిప్రతిష్టాపన, పలు హోమాలు, వేదపారాయణం నిర్వహణ ఉంటుందన్నారు. 9న శ్రీమన్నారాయణ వ్రతం, సనాతన ధర్మ సంరక్షణ సభ జరుగుతాయని తెలిపారు. అనంతరం శ్రీ మహాలక్ష్మి నారాయణ యజ్ఞ లఘు పూర్ణాహుతి, వేదపారాయణం నిర్వహిస్తామన్నారు. చివరి రోజు పలు హోమాలతో పాటు సనాతన ధర్మ సంరక్షణ సభ, పలు సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రముఖుల ప్రసంగాలు, పండితుల ప్రవచనాలు, పూర్ణాహుతితో యాగం ముగుస్తుందని రేజేటి శ్రీరామాచార్యులు పేర్కొన్నారు. యాగం నిర్వహించే మూడు రోజులు అన్నదానం ఉంటుందని, ప్రతి రోజూ సాయంత్రం ఆర్కే బీచ్‌లో సాగరహారతి నిర్వహిస్తామని వెల్లడించారు.

ధ్యానంపై పెరుగుతున్న ధ్యాస



పిరమిడ్ కేంద్రంలో ధ్యానం చేస్తున్న ఔత్సాహికులు



శాకాహారం తినాలంటూ గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న పిరమిడ్ కేంద్రం సభ్యులు

- పిరమిడ్ ధ్యాన కేంద్రాలపై జనం ఆసక్తి
- ఆరోగ్యం, ఏకాగ్రత, ఒత్తిడిని నుంచి ఉపశమనం
- చౌడువాడలోని పిరమిడ్ కేంద్రానికి విశేష ఆదరణ

కె.కోటపాడు : ప్రస్తుతం జీవన శైలీలో వచ్చిన మార్పులతో ప్రతి ఒక్కరూ ఒత్తిడికి గురవడం తప్పడం లేదు. ఈ ప్రభావం శరీరంపై పడి రోగాల బారిన పడుతున్నారు. ఆ తరువాత ఆస్పత్రులకు వెళ్లి వైద్యం పొంది జేబులకు చిల్లులు పెట్టుకుంటున్నారు. అయితే ఈ రకమైన అనారోగ్య సమస్యలను అధిగమించేందుకు ధ్యానం చేస్తే ఫలితం ఉంటుందన్న సంగతి చాలా మందికి తెలియదు. ధాన్యంతో శ్వాసపై ధ్యాసను చూపడం ద్వారా చాలా సమస్యలను అధిగమించవచ్చునని పిరమిడ్ ధ్యాన కేంద్రం మాస్టర్‌లు సూచిస్తున్నారు. ధ్యానంతో మంచి ఆరోగ్యంతో పాటు ఏకాగ్రత, మంచి విషయాలతో ఆలోచనలు వస్తాయని చెబుతున్నారు. ఈ బిజీ ప్రపంచంలో క్షణం తీరిక లేక మానసిక ప్రశాంతతకు నోచుకోక రోగాలతో మదనపడుతున్న వారికి పిరమిడ్ ధ్యాన కేంద్రాలు ఎంతో ఉపశమనాన్ని కలిగిస్తున్నాయి.

చౌడువాడలో పిరమిడ్ నిర్మాణం

చౌడువాడ గ్రామానికి చెందిన మీనాకుమారి తనకు మూడేళ్ల క్రితం వచ్చిన అనారోగ్య సమస్యను పిరమిడ్ ధ్యానం ద్వారా అధిగమించారు. దీంతో ఆమె స్వగ్రామంలో తన ఇంటిపైనే ఆత్మజ్యోతి పిరమిడ్‌ను నిర్మించారు. శ్రీచక్రంతో కూడిన నమూనా ద్వారా ఈ పిరమిడ్‌ను తీర్చిదిద్దారు. రోజూ ఉదయం 5 నుంచి రాత్రి 7 గంటల వరకూ ఈ పిరమిడ్‌లో ఉచితంగా ధ్యానం చేయవచ్చు. రోజూ ఈ పిరమిడ్ ధ్యాన కేంద్రంలో 60 మంది ధ్యానం చేస్తుంటారు. మన వయస్సు ఎంత అయితే అన్ని నిమిషాలు ధ్యానం చేస్తే మంచి ఆరోగ్యం సిద్ధిస్తుందని ధ్యానం మాస్టర్లు చెబుతున్నారు. ధ్యానం అనంతరం కేంద్రం నిర్వాహకురాలు మీనాకుమారి ఆధ్యాత్మిక విషయాలపై బోధన చేస్తున్నారు.

శాకాహారంపై అవగాహన ర్యాలీలు

ఇక్కడి కేంద్రం సభ్యులు శాకాహారంపై విస్తృత ప్రచారం చేస్తున్నారు. జీవ హింస చేయడం ద్వారా తినే ఆహారం మంచిది కాదని వివరిస్తూ ప్రతి నెలా గ్రామాల్లో అవగాహన ర్యాలీలు చేపడుతున్నారు. ఆయా గ్రామాల్లో ప్రతి పౌర్ణమి రోజున పౌర్ణమి ధ్యానంపై ప్రత్యేక శిక్షణను ఇస్తున్నారు. ధ్యానంతో ప్రతి ఒక్కరిలో వస్తున్న మానసిక ప్రవర్తన, ఒత్తిడిని అధిగమిస్తుండడం, మంచి ఆరోగ్యాన్ని పొందుతుండడంతో అందరూ ఆసక్తి చూపుతున్నారు.

ధ్యానం చేయడం తప్పనిసరి



నా కోడలు మీనాకుమారి అనారోగ్యానికి గురైన సయమంలో స్నేహితులు చెప్పిన మేరకు బ్రహ్మశ్రీ పితామహ సుభాస్ పత్రీజీ పిరమిడ్ ధ్యాన కేంద్రానికి వెళ్లింది. ధ్యానంతో పూర్తి ఏకాగ్రతను సాధించింది. అనారోగ్య సమస్యను అధిగమించింది. దీంతో ఆమె కోరిక మేరకు పిరమిడ్ ధ్యాన కేంద్రాన్ని నిర్మాణం చేశాం. ఈ కేంద్రానికి ఎంతో మంది వచ్చి పలు సమస్యలకు ఉపశమనం పొందుతున్నారు. ధ్యానం అనంతరం ఆధ్యాత్మిక బోధన చేస్తున్నాం. ప్రస్తుత పరిస్థితిలో ధ్యానం చేయడం తప్పనిసరి.

– భీశెట్టి సత్యనారాయణ, ధ్యాన కేంద్రం మాస్టర్, చౌడువాడ

మానసిక ప్రశాంతత కలిగింది..



వయస్సు 60 ఏళ్లు దాటింది. ఏదో ఒక రూపంలో మనసులో ఆందోళన, భయం ఉంటుండేది. దీంతో గ్రామంలోని పిరమిడ్ ధ్యాన కేంద్రంలో 120 రోజులుగా సాయంత్రం పూట వెళ్లి ధ్యానం చేశాను. ఏకాగ్రతతో ధ్యానం చేయడం వల్ల మంచి ఆరోగ్యంతో పాటు భయం, ఆందోళన సమస్య లేకుండా పోయింది. రోజూ ధ్యానం చేయాలన్న ఆసక్తి మరింత పెరిగింది. మానసిక ప్రశాంతత కలిగింది.

– సన్యాసమ్మ, గృహిణి, చౌడువాడ

ధర్మశ్రీకి పూర్తి సహాయ సహకారాలు

కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే కన్నబాబురాజు



సమావేశంలో మాట్లాడుతున్న కన్నబాబురాజు



హాజరైన వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ముఖ్య నేతలు

అచ్యుతాపురం రూరల్: ఇప్పటి వరకూ తనకు ఎటువంటి సహాయ సహకారాలు అందించారో ఇకపై కరణం ధర్మశ్రీకి మీ మద్దతు, ఆశీస్సులు, అండదండలు కొనసాగించాలని మాజీ శాసన సభ్యుడు యు.వి.రమణమూర్తి రాజు(కన్నబాబురాజు) పార్టీ శ్రేణులను కోరారు. పార్టీ మండలాధ్యక్షుడు దేశంశెట్టి శంకర్రావు అధ్యక్షతన ఆదివారం కొండకర్ల గెస్ట్ హౌస్‌లో కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. కన్నబాబురాజు మాట్లాడుతూ తన ప్రాణం ఉన్నంత వరకూ వైఎస్సార్‌సీపీలోనే కొనసాగుతానని స్పష్టం చేశారు. 30 సంవత్సరాల నుంచి తనకు సహకరించి, మద్దతు తెలిపిన నాయకులకు, కార్యకర్తలకు జీవితాంతం రుణపడి ఉంటానన్నారు. వారికి ఎల్లవేళలా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

నియోజకవర్గంతో అవినాభావ సంబంధం: ధర్మశ్రీ

యలమంచిలి నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ మాట్లాడుతూ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆశీస్సులతో నియోజకవర్గ సమన్వయకర్తగా బాధ్యతలు చేపట్టానన్నారు. నియోజకవర్గంతో తనకు చాలా అవినాభావ సంబంధం ఉందన్నారు. నియోజకవర్గంలో బంధువులు, స్నేహితులు, పరిచయస్తులు ఎక్కువగా ఉన్నారని, తాను మామిడివాడ కొత్తూరులో జన్మించానని తెలిపారు. రానున్న ఎన్నికల్లో అందరి సహకారంతో పార్టీకి పునర్ వైభవం వచ్చేలా శాయశక్తులా కృషి చేస్తానన్నారు. ఈ సమావేశానికి నాలుగు మండలాల నుంచి హాజరైన ముఖ్య నాయకులు మాట్లాడుతూ ఇప్పటి వరకూ కన్నబాబురాజు స్వీయ క్రమశిక్షణలో నడుచుకున్నామన్నారు. ఏ సమస్య వచ్చినా ఆయన్ని కలిసి చెబితే పరిష్కరించేవారన్నారు. ఏడు పదుల వయస్సులోనూ అందరికంటే ముందుగా వచ్చి కార్యక్రమాలు ప్రారంభించేవారన్నారు. వయోభారంతో ధర్మశ్రీకి బాధ్యతలు అప్పగించడం నియోజకవర్గ పార్టీ కేడర్ సాదరంగా స్వాగతిస్తుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్, సహాయ కార్యదర్శి బోదెపు గోవింద్, ఉమ్మడి విశాఖ జెడ్పీటీసీల సంఘం అధ్యక్షుడు దొండా రాంబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి జోగా కొండబాబు, జెడ్పీటీసీలు లాలం రాము, దూళి నాగరాజు, పెంటకోట సోము సత్యనారాయణ, సేనాపతి రాము, పార్టీ అధ్యక్షులు బొద్దపు యర్రయ్య దొర, కొల్లి త్రినాథ్, పిన్నమరాజు కిషోర్ రాజు, ఆడారి అచ్చియ్యనాయుడు, పార్టీ సీనియర్ నాయకులు కోన బుజ్జి, గొట్టుముక్కల శ్రీనుబాబు, నెట్టెం సత్యనారాయణ, సూర్యనారాయణ మాస్టారు, నాలుగు మండలాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.

ఘనంగా మోదమాంబ అమ్మవారి జాతర



మోదమాంబను దర్శించుకుంటున్న మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలునాయుడు, తదితరులు



మోదమాంబ అమ్మవారి పాదాలు, పోతురాజు బాబుకు పూజలు చేస్తున్న భక్తులు

మాడుగుల రూరల్: కె.జె.పురం గ్రామ ఆరాధ్య దైవం మోదమాంబ జాతర ఆదివారం వైభవంగా జరిగింది. ఉదయం నుంచి భక్తులు అమ్మవారి దర్శనం కోసం బారులు తీరారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేశారు. అమ్మవారిని మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలునాయుడు, ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్లు మళ్ల సురేంద్ర, బత్తుల తాతయ్యబాబు, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, మార్కెట్ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, సినీనటుడు కారుమూరి రఘు, సర్పంచ్ జామి రమణబాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు కాళ్ల రాము, కాళ్ల అప్పలనాయుడు, మళ్ల కన్నబాబు, ఆడారి శంకర్, ఎం.వి.సత్యనారాయణ, తదితరులు దర్శించుకున్నారు. భక్తులు, చిరు వ్యాపారులకు స్థానిక కేటరింగ్ వ్యాపారి పాలకుర్తి అరుణ్‌కుమార్ అన్నదానం చేశారు.

శిష్టకరణ సమితి నూతన కార్యవర్గం ఎన్నిక



ప్రమాణ స్వీకారం చేస్తున్న శిష్టకరణ సమితి నూతన కార్యవర్గం

అనకాపల్లి: శిష్టకరణ సమితి 55వ వార్షికోత్సవ సర్వసభ్య సమావేశం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ రహదారి వివేకానంద చారిటబుల్ ట్రస్ట్ హాల్‌లో ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా జిల్లా శిష్టకరణ సంఘం అధ్యక్షుడు ఎస్‌వీఎస్ పట్నాయక్ మాట్లాడుతూ త్వరలో అన్ని మండల కేంద్రాల్లోని సమితి శాఖలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పదో తరగతి, ఇంటర్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షుడిగా పక్కి రమేష్, గౌరవాధ్యక్షుడిగా ఎస్‌వీఎస్ పట్నాయక్, ఉపాధ్యక్షురాలిగా పోలాకి సునీత, ప్రధాన కార్యదర్శిగా డబ్బీరు విష్ణుమూర్తి, కోశాధికారిగా డి.శేషుమల్లేశ్వరరావు, కమిటీ మీడియా కో–ఆర్డినేటర్‌గా రొంపిల్లి కిరణ్, ఆడిటర్‌గా భాసూరి ఉమామహేశ్వరరావుతో పాటు 17 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు బద్రిమహంతి వెంకటరావు, మాజీ పట్టణ అధ్యక్షుడు బగ్గాం సురేంద్ర నాథ్ బెనర్జీ, మాజీ కార్యదర్శి జగ్గుమంత్రి రమాదేవి, జిల్లా నాయకుడు డబ్బీరు సత్యప్రసాద్,తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలపై నేడు 'చలో విజయవాడ'

అనకాపల్లి: విద్యుత్ రంగంలో పని చేస్తున్న అన్ని విభాగాల ఉద్యోగులు, కార్మికులు తమ డిమాండ్ల సాధన కోసం సోమవారం విజయవాడలో విద్యుత్ సౌధ కార్యాలయం వద్ద రాష్ట్ర ధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యుడు కోన లక్ష్మణ తెలిపారు. ఆదివారం స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. జెన్కో, ట్రాన్స్‌కో, డిస్కంలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ సిబ్బంది, మీటర్ రీడర్లు, ఎనర్జీ అసిస్టెంట్లు తదితరులు ఈ ధర్నాలో పాల్గొనాలని కోరారు. విద్యుత్ రంగాన్ని నిబద్ధతతో నడిపించే అసలైన శ్రమజీవుల హక్కుల కోసం పోరాటం చేస్తున్నామన్నారు. జిల్లా నలుమూలల నుంచి వేలాదిగా కార్మికులు విజయవాడకు తరలి రావాలని కోరారు. ఉద్యోగుల సహనం పరీక్షించొద్దని ఆయన హెచ్చరించారు.

విదేశీ మద్యం పట్టివేత

రూ.18 లక్షల విలువైన 220 బాటిళ్ల స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు

అరిలోవ: నగరంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఒకరి నుంచి 220 విదేశీ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆర్.ప్రసాద్ తెలిపారు. పిఠాపురంకాలనీలోని సీతమ్మధార ఎక్సైజ్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ వివరాలు వెల్లడించారు. అక్కయ్యపాలెం లలితానగర్‌లో చెన్నైకి చెందిన తిరుపతి వెంకటేశన్ పిళ్లై అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో.. ఎక్సైజ్, టాస్క్ ఫోర్స్ అధికారులు, సిబ్బంది నిఘా పెట్టారు. ఇందులో భాగంగా శనివారం స్కూటీలో మద్యం బాటిళ్లు పెట్టి విక్రయిస్తున్న అతన్ని లలితానగర్‌లో పట్టుకుని వివరాలు సేకరించారు. పిళ్లై కొన్నాళ్లుగా లలితానగర్‌లో నివాసం ఉంటూ ఒక గోడౌన్‌ను అద్దెకు తీసుకున్నాడు. చెన్నై నుంచి విదేశీ మద్యం బాటిళ్లను తీసుకువచ్చి తెలిసిన వారికి విక్రయిస్తున్నాడు. ఈ నేపథ్యంలో సమాచారం అందుకున్న ఎక్సైజ్, టాస్క్‌ఫోర్స్ పోలీసులు శనివారం అతనిని పట్టుకొని గోడౌన్‌ను తనిఖీ చేశారు. అందులో 34 బ్రాండ్లకు చెందిన 220 విదేశీ మద్యం బాటిళ్లతో పాటు రూ.4,310, స్కూటీని స్వాధీనం చేసుకున్నారు. అతనిపై కేసు నమోదు చేశారు. ఈ మద్యం బాటిళ్ల ధర రూ.15 లక్షల నుంచి రూ.18 లక్షల వరకు ఉంటుందని అంచనా వేశారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ అధికారులు రాజశేఖర్, ముసలినాయుడు, సిబ్బంది అప్పారావు, కె.వి.ఎం.రాజు, సతీష్ పాల్గొన్నారు.

లారీ ఢీకొని వృద్ధురాలి మృతి



మృతి చెందిన దాసరి ఆదిలక్ష్మి

పరవాడ: లంకెలపాలెం కూడలిలో ఆదివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధురాలు మృతి చెందారు. లంకెలపాలెం దరి శ్రీనగర్ కాలనీలో దాసరి ఆదిలక్ష్మి(67) తన భర్తతో కలిసి నివాసం ఉంటున్నారు. కూర్మన్నపాలెంలో ఉంటున్న తన కూతురిని చూసేందుకు ఆదివారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో బయలుదేరారు. లంకెలపాలెం కూడలిలో ఆటో ఎక్కేందుకు రోడ్డు దాటుతుండగా.. వేగంగా వచ్చిన సిమెంట్ లారీ ఆమెను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆదిలక్ష్మి అక్కడికక్కడే మృతి చెందారు. ఘటనా స్థలాన్ని పరవాడ డీఎస్పీ వి.విష్ణు స్వరూప్, సీఐ ఆర్. మల్లికార్జునరావు సందర్శించి ప్రమాదానికి గల కారణాలను సేకరించారు. మృతురాలి కుమారుడు దాసరి వెంకట్ కిరణ్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వేగ నియంత్రణకు చర్యలు

లంకెలపాలెం జంక్షన్ మీదుగా ప్రయాణించే వాహనాల వేగాన్ని నియంత్రించడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని సీఐ మల్లికార్జునరావు తెలిపారు. జంక్షన్ మీదుగా రాకపోకలు సాగించే వాహనాల వేగాన్ని తగ్గించి, అన్ని వైపుల నుంచి ప్రయాణికులను గమనిస్తూ వాహనాలను నడపాలని సూచించారు. కూడలిలో ట్రాఫిక్ నియంత్రణ కోసం రోడ్డు భద్రతా చిహ్నాలు, స్టాపర్లు, పికెట్లను ఏర్పాటు చేసినట్లు సీఐ వెల్లడించారు. ప్రజలు రోడ్డు దాటే సమయంలో అన్ని వైపుల నుంచి వాహనాలను చూసుకొని జాగ్రత్తగా రోడ్డు దాటాలని కోరారు.

భక్తుల బసలో.. అప్పన్న పాలన

శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం... రాష్ట్రంలోనే స్వయంప్రతిపత్తిగల ప్రముఖ దేవస్థానాల్లో ఒకటి. ఇంతటి ఘనత ఉన్నప్పటికీ పన్నెండేళ్లుగా సొంత కార్యాలయ భవనం అంటూ లేదంటే ఆశ్చర్యపోనక్కర్లేదు. అధికారుల నిర్లక్ష్యమో... ప్రణాళికా లోపమో... మరే ఇతర కారణాలో తెలియదుగానీ.. ఇప్పటి వరకు సొంత కార్యాలయ భవన నిర్మాణానికి కనీసం శంకుస్థాపన కూడా చేయలేదు. భక్తుల సేవకు నిర్మించిన భవనాల్లో చేరి, కార్యకలాపాలు నిర్వహించాల్సిన పరిస్థితి.



అడవివరం ప్రధాన రహదారిని ఆనుకుని గతంలో ఉన్న ఈవో కమ్ పరిపాలనా కార్యాలయం(ఫైల్) దీన్నే తొలగించారు

- సింహాచలం దేవస్థాన పరిపాలన కార్యాలయ భవన నిర్మాణం ఎప్పుడో?
- పుష్కర కాలం కావస్తున్నా.. నిర్మాణం కాని నూతన పరిపాలన భవనం
- బీఆర్‌టీఎస్ విస్తరణలో తొలగించిన పరిపాలన కార్యాలయం
- విజయరామరాజు కల్యాణమండపంలో పరిపాలనా కార్యాలయం
- టీటీడీ సత్రం వీఐపీ గదుల్లో ఈవో, ఎస్‌డీసీ చాంబర్లు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి కొండదిగువ అడవివరం ప్రధాన రహదారిలో 2013 వరకు అతి పెద్ద పరిపాలనా కార్యాలయ భవనం ఉండేది. ఈవో చాంబర్‌తో పాటు, విభాగాధిపతులకు, సూపరింటెండెంట్లకు ప్రత్యేక గదులు, సిబ్బంది విధులు నిర్వర్తించేందుకు ప్రత్యేక హాళ్లు, ప్రాంగణాలు ఉండేవి. ఎంతో మంది ఈవోలు ఆ భవనం పాలన సాగించారు. సింహాచలానికి వెళ్లే ప్రధాన రహదారి పక్కనేవుండటంతో దేవస్థానం సిబ్బందికి ఎంతో సౌకర్యంగా ఉండేది. దేవస్థానం కార్యాలయానికి పనిమీద వెళ్లే విజిటర్స్‌కు సింహాచలం ఆర్టీసీ బస్టాండ్‌లో దిగగానే కార్యాలయం కనిపించేది.

బీఆర్‌టీఎస్ విస్తరణలో తొలగింపు

2013లో ప్రారంభమైన పాత గోశాల జంక్షన్ నుంచి పాత అడవివరం జంక్షన్ బీఆర్‌టీఎస్ రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా అదే ఏడాది ఈ భవనాన్ని తొలగించారు. దీని ప్రతిఫలాన్ని దేవస్థానానికి అప్పట్లోనే జీవీఎంసీ అందించింది. దీంతో వరాహ పుష్కరిణికి వెళ్లే మార్గంలో ఉన్న విజయరామరాజు కల్యాణమండపంలోకి హుటాహుటిన పరిపాలనా కార్యాలయాన్ని తాత్కాలిక ప్రాతిపదికన మార్చు చేశారు. ఆ పక్కనే ఉన్న టీటీడీ కల్యాణమండపంలోని ఆరు వీఐపీ గదులను ఈవో చాంబర్, దేవస్థానం భూపరిరక్షణ విభాగం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కార్యాలయం, ఇతర వినియోగాలకు కేటాయించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు వాటిల్లోనే ఆయా కార్యాలయాలు కొనసాగుతున్నాయి.



ఎస్‌డీసీ కార్యాలయాలు ఏర్పాటు చేసిన టీటీడీ సత్రంలోని వీఐపీ గదులు



పరిపాలన కార్యాలయం ఏర్పాటు చేసిన విజయరామరాజు కల్యాణమండపం

సొంత భవనంపై ధ్యాసేదీ?

భక్తుల కోసం నిర్మించిన భవనాలను స్వాధీనం చేసుకుని పన్నెండేళ్లుగా పాలనా వ్యవహారాలు నడుపుతన్నారు తప్ప, కొత్తగా పరిపాలనా కార్యాలయ నిర్మాణానికి కనీసం చొరవ చూపని దుస్థితి. సింహగిరి దివ్యక్షేత్రం పనుల పేరిట రూ.కోట్లలో దేవస్థానం ఖర్చుచేసింది. కొన్ని అనవసర పనులకు సైతం రూ.కోట్లు వెచ్చించిన దాఖలాలున్నాయి. ముఖ్యంగా కొట్టడాలు... కట్టడాల పేరిట రూ.కోట్లు వృథా చేశారన్న విమర్శలు కూడా ఉన్నాయి. కానీ దేవస్థానం పరిపాలనా కార్యాలయ సొంత భవనం నిర్మాణంపై మాత్రం అధికారులు దృష్టి సారించలేదు. అదిగో... ఇదిగో... అంటూ ఇప్పటివరకు కాలక్షేపం చేస్తూ వస్తున్నారు.

పరిపాలనా కార్యాలయ విభాగాలు

లీగల్ సెక్షన్, ఎస్టాబ్లిష్‌మెంట్ సెక్షన్, అకౌంట్స్ సెక్షన్, లీజెస్ సెక్షన్, ఇంజినీరింగ్ సెక్షన్, కంప్యూటర్ భూపరిపరిరక్షణ విభాగం, శానిటేషన్ విభాగం, ఎలక్ట్రికల్ స్టోర్స్ తదితర విభాగాలు.

ప్రణాళికలతో సరి

పాత అడవివరం జంక్షన్ నుంచి హనుమంతవాక వెళ్లే బీఆర్‌టీఎస్ రోడ్డుమార్గంలో ఉన్న రెండవ టోల్‌గేట్ సమీపంలో దేవస్థానం పరిపాలనా కార్యాలయ నిర్మాణానికి అప్పట్లో ప్రణాళిక చేశారు. ఆ ప్రణాళిక మరుగున పడింది.

దేవస్థానం ఆదాయానికి గండి

మరోవైపు పుష్కర కాలంగా కొండదిగువ విజయ రామరాజు కల్యాణ మండపంలో పరిపాలనా కార్యాలయం, టీటీడీ సత్రంలోని ఆరు వీఐపీ గదుల్లో ఈవో చాంబర్, ఎస్‌డీసీ చాంబర్ తదితరాలు ఏర్పాటు కావడంతో పెద్ద మొత్తంలో దేవస్థానం ఆదాయాన్ని కోల్పోయింది. వీఐపీ గదులను అద్దెకు ఇచ్చేవారు. దేవస్థానానికి ఎవరైనా ప్రముఖులు వస్తే వారికి ఆ గదులను కేటాయించేవారు. విజయరామరాజు కల్యాణమండపాన్ని ఒక వివాహ బృందానికి రోజుకు రూ.4 వేలు నుంచి రూ.5 వేలు వరకు అద్దెకు ఇచ్చేవారు. దీంతో దేవస్థానం ఆ మేరకు 12 ఏళ్లుగా ఆదాయాన్ని కోల్పోతూనే వస్తోంది. పెద్ద మొత్తంలో ఆదాయం కోల్పోయింది.

నిర్మాణ ప్రణాళిక ఉంది

రెండవ ఘాట్‌రోడ్డు ప్రారంభంలో దేవస్థానం నూతన పరిపాలన కార్యాలయ భవన నిర్మాణ ప్రణాళిక ఉంది. అప్పట్లో కొన్ని టెక్నికల్ ఇబ్బందులు, దివ్యక్షేత్రం మాస్టర్‌ప్లాన్‌లో మార్పులు, చే ర్పులు కారణంతో ఆలస్యం జరిగింది. త్వరలోనే నూతన కార్యాలయం నిర్మాణం జరుగుతుంది.

–రమణ, ఈఈ, సింహాచలం దేవస్థానం

క్లుప్తంగా

ఘనంగా మోదకొండమ్మ ఉత్సవం



అమ్మవారిని దర్శించుకుంటున్న వైస్ ఎంపీపీ జ్యోతి, ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాసరావు

కశింకోట: స్థానిక శారదానది అవతల పాలాల్లో మోదకొండమ్మ ఉత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కోలాటాలు, తోడపెద్దు సేవలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారి ఆలయంలో పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ పెంటకోట శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ జ్యోతి దంపతులు, రైతులు, ప్రజలు అమ్మవారిని దర్శించుకున్నారు. చీరలు, రవికెలు, అరటి గెలల రూపంలో అమ్మవారికి మొక్కులు సమర్పించుకున్నారు.

పర్యావరణాన్ని కాపాడుదాం



మొక్కలు నాటుతున్న గ్రామ సర్పంచ్, గ్రీన్ క్లబ్ సభ్యులు

అనకాపల్లి టౌన్: మొక్కలను నాటి పర్యావరణాన్ని కాపాడుదామని సర్పంచ్ యాదగిరి అప్పారావు తెలిపారు. గ్రీన్ క్లబ్ ఆధ్వర్యంలో మండలంలోని తగరంపూడి పీహెచ్‌సీ ఆవరణలో మొక్కల నాటే కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటాలని కోరారు. పచ్చదనాన్ని పెంపొందించడం ద్వారా పర్యావరణాన్ని కాపాడుకోవచ్చన్నారు. తద్వారా కాలుష్యాన్ని తగ్గించుకోవచ్చన్నారు. ఇందులో భాగంగా 35 మొక్కలను నాటారు. గ్రీన్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొణతాల ఫణిభూషణ్ శ్రీధర్, వైస్ ఎంపీపీ అయితా రాము, గ్రామ పెద్దలు చెల్లయ్య, బోనగిరి రామకృష్ణ, యర్రా చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

27న 'బుద్ధునితో నా ప్రయాణం' నాటిక



ఆహ్వాన పత్రాలను విడుదల చేస్తున్న అసోసియేషన్ సభ్యులు

అనకాపల్లి టౌన్: విశాఖ బుద్ధిస్ట్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ నెల 27న విశాఖపట్నం అంబేడ్కర్ భవన్‌లో బుద్ధునితో నా ప్రయాణం అనే తెలుగు నాటిక ప్రదర్శించనున్నట్టు సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు బల్లా నాగభూషణం తెలిపారు. నాటిక ఆహ్వాన కరపత్రం, గోడపత్రికలను ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నాటికలో బుద్ధుని త్యాగనిరతి, జీవిత ఘట్టాలు ప్రదర్శితమవుతాయన్నారు. వినకోట నీలేష్ గుప్తా, పట్నాల కృష్ణమోషన్, కొత్తుర్తి రామారావు, బొడ్డు సోమరాజు పాల్గొన్నారు.

అప్పన్న సన్నిధిలో నాగఫణీంద్రశర్మ

సింహాచలం: వరాహ లక్ష్మీనృసింహస్వామిని ఆదివారం ప్రముఖ అవధాని మాడుగుల నాగఫణీంద్రశర్మ దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అర్చకులు స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి ప్రసాదం, శేషవస్త్రం, చిత్రపటాన్ని అందజేశారు.

అనకాపల్లి సినిమాలు

రాజా	: మై బేబి
సత్యనారాయణ స్క్రీన్-1	:జూనియర్
సత్యనారాయణ స్క్రీన్-2	:కన్నప్ప
పర్తిసాయి	:ఓ భామ అయ్యో రామ
షిర్డీసాయి	: కొత్తపల్లిలో ఒకప్పుడు
వెంకటేశ్వర	: మిస్టర్ రెడ్డి
శ్రీ సత్య	: ఏమాయ చేసావె
రామచంద్ర	: 3 బీహెచ్‌కే

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 59 యూనిట్ల రక్త నిల్వ ఉంది. ఏ పాజిటివ్-19, బీ పాజిటివ్-7, ఓ పాజిటివ్-30, ఏబీ పాజిటివ్-3 యూనిట్లు శుద్ధి చేసిన రక్త నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంక్ టెక్నీషియన్ యూ లోకేష్(9703613706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా ఆదివారం 234 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 191 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924-223595 నంబరును సంప్రదించవచ్చు.

అచ్చెర్ల రోడ్డుకు మోక్షమెప్పుడో..



వర్షం నీటితో గతుకులు నిండి ఉన్న అచ్చెర్ల వెళ్లే రోడ్డు

- అడుగడుగునా గోతులు
- వర్షం కురిస్తే తటాకాలు
- వాహనాలకు తరచూ మరమ్మతులు
- వాహనదారులకు తప్పని పాట్లు

కశింకోట: అడుగడుగునా గతుకులు.. వర్షం కురిస్తే అందులో నీరు చేరి చెరువును తలపిస్తోంది. దాంతో వాహనదారులు రాకపోకల సమయంలో నిత్యం నరకయాతన అనుభవిస్తున్నారు. మండలంలోని అచ్చెర్ల రోడ్డుకు ఇంకెప్పుడు మోక్షం కలుగుతుందా? అని మదన పడుతున్నారు. మూడు మండలాల గ్రామాల ప్రజలకు ఉపయోగపడే ఈ రోడ్డు దశాబ్ద కాలంగా ఇదే పరిస్థితిలో ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ ఏడాది సంక్రాంతికి రోడ్లు గోతులు లేకుండా బాగు చేస్తామని ప్రకటించింది. అయితే ఆరు నెలలు గడుస్తున్నప్పటి వాటి గురించి పట్టించుకోవడం లేదని విమర్శిస్తున్నారు. దీంతో తమ నిత్య కష్టాలు తప్పడం లేదని నిట్టూరుస్తున్నారు.

మండలంలోని తాళ్లపాలెం-నర్సీపట్నం రోడ్డు, భవనాల శాఖ రోడ్డులో కూడలి నుంచి అచ్చెర్ల వెళ్లే రోడ్డు సుమారు ఐదు కిలో మీటర్లు దూరం ఉంటుంది. ఈ రోడ్డులో సింగవరం, గమినిపేట, కొత్త అచ్చెర్ల, అచ్చెర్ల, మోసయ్యపేట వంటి గ్రామాలున్నాయి. ఇదే రోడ్డు మీదుగా కొత్త అచ్చెర్ల నుంచి గోకివానిపాలెం, బుచ్చెయ్యపేట మండలంలోని మల్లాం, చిన్న మల్లాం, రాజాం, రావికమతం, అనకాపల్లి మండలం కుంద్రం, కుంచంగి గ్రామాలకు వెళ్లడానికి ఈ ప్రాంతం వారికి దగ్గరి మార్గం. దీంతో ఈ రోడ్డు నిత్యం రద్దీగా ఉంటుంది. ద్విచక్ర వాహనాలు, ఆటోలు, వ్యాన్లు, లారీలు, స్కూలు బస్సులు ఈ మార్గంలో నిత్యం రాకపోకలు సాగిస్తుంటాయి. వాహనాల రద్దీతో రోడ్డు దెబ్బతిని దశాబ్దం క్రితం నుంచి గతుకులతో నిండి ఉంది.



గోతులతో నిండి ఉన్న అచ్చెర్ల రోడ్డు

అత్యవసర పరిస్థితుల్లో అష్టకష్టాలు

అడుగడుగునా ఉన్న గోతుల వల్ల ఇవి ఏ మాత్రం వర్షం పడినా నిండిపోతున్నాయి. దాంతో గోతులు కానరాక వాటిలో వాహనాలు పడి ప్రమాదాలకు గురికావలసి వస్తోందని చోదకులు వాపోతున్నారు. ఆటోలు మరమ్మతులకు గురవుతున్నాయని వాటి కార్మికులు ఆవేదన చెందుతున్నారు. ఇక చీకటి పడిందంటే గోతులు కానక మరింత ఇబ్బంది చెందుతున్నామని, గోతుల వల్ల ఆటో కార్మికులు ప్రజల ప్రయాణానికి ముందుకు రావడం లేదని ఆవేదన చెందుతున్నారు. దీంతో నడిచి గమ్యాలకు చేరాల్సి వస్తోందని ఆందోళన చెందుతున్నారు. రోగులను, గర్భిణులను ఆస్పత్రికి తరలించడం వంటి అత్యవసర పరిస్థితుల్లో అష్టకష్టాలు పడాల్సి వస్తోందని వాపోతున్నారు. ఈ ఏడాది సంక్రాంతికి రోడ్లను బాగు చేస్తామని కూటమి ప్రభుత్వం ప్రకటించినప్పటికి ఆచరణలో అమలు కాలేదని విమర్శిస్తున్నారు. ఇక ఎంత కాలం నరకం అనుభవించాల్సి ఉంటుందోనని మదన పడుతున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు చొరవ తీసుకొని రోడ్డు బాగు చేయడానికి చర్యలు తీసుకొని తమ కష్టాలు గట్టెక్కించాలని స్థానికులు, వాహన చోదకులు కోరుతున్నారు.

పాడవుతున్న వాహనాలు



అచ్చెర్ల వెళ్లే రోడ్డు నాలుగు మండలాల గ్రామాల ప్రజల రాకపోకలు సాగించడానికి ఉపయోగపడుతుంది. ఇది అడుగడుగునా గతుకులతో నిండి ఉంది. దీనివల్ల వాహనాలు గోతుల్లో పడి ప్రమాదాలు కొని తెచ్చుకోవలసి వస్తోంది. వాహనాలు గోతుల్లో పడటం వల్ల మరమ్మతులకు గురై ఆర్థికంగా నష్టపోవలసి వస్తోంది. రోడ్డు మరమ్మతులు చేపట్టాలని, లేదా పునర్నించాలి. ఈ విషయమై అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు. ఉన్నతాధికారులైన చొరవ తీసుకొని రోడ్డు మరమ్మతులు గాని, పునర్నిర్మాణానికి గాని సత్వర చర్యలు తీసుకోవాలి

–జి. నాగు, గమినిపేట, అచ్చెర్ల శివారు.

అత్యవసర సమయాల్లో ఇబ్బందులు



చాలా కాలంగా అచ్చెర్ల రోడ్డు అధ్వానంగా ఉంది. ఏ మాత్రం వర్షం పడినా గోతులలో నిండి పోతోంది. దీంతో గోతులు కాన రాక ప్రమాదాలకు గురికావలసి వస్తోంది. ప్రయాణానికి ఆటోలు కూడా నడపడానికి కార్మికులు ముందుకు రావడం లేదు. దీంతో అత్యవసర సమయాల్లో నానా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. తమ ఇబ్బందులు గుర్తించి రోడ్డును సత్వరమే బాగు చేయాలి.

–కె. ప్రదీప్, సింగవరం గ్రామం

ఉత్సాహంగా లాంగ్ వాకింగ్ పోటీలు



లాంగ్ వాకింగ్ పోటీలను జెండా ఊపి ప్రారంభిస్తున్న అప్పారావు

అనకాపల్లి: ఆరోగ్యంగా జీవించాలంటే ప్రతి వ్యక్తి నిత్య వ్యాయామం చేయాలని బెస్ట్ ఫ్రెండ్స్ క్లబ్ చైర్మన్ పి.ఎస్.అప్పారావు తెలిపారు. ఆగస్టు 3న అంతర్జాతీయ స్నేహ దినోత్సవాన్ని పురస్కరించుకుని బెస్ట్ ఫ్రెండ్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక రింగ్‌రోడ్డులో లాంగ్ వాకింగ్ పోటీలను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా తర్వాత మానవ జీవనశైలిలో అనేక మార్పులు సంభవించాయన్నారు. వయసుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ వివిధ రకాల వ్యాధులు బారినపడుతున్నట్లు పేర్కొన్నారు. నిత్య వ్యాయామం చేయడం వల్ల ఆరోగ్యంగా జీవించే అవకాశాలు ఉన్నట్లు పేర్కొన్నారు. అనంతరం లాంగ్ వాకింగ్ పోటీల్లో విజేతలకు డాక్టర్ డి.డి.నాయుడు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ గౌరవాధ్యక్షుడు పెంటకోట నర్సింగరావు, అధ్యక్షుడు బి.ఎస్.ఎం.కె. జోగినాయుడు, కార్యదర్శి పెంటకోట ప్రభాకర్, కోశాధికారి భర్కికాన శ్రీనివాసరావు, క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రైతు బజారు ఏర్పాటు చేయాలని ధర్నా



డీసీఎంఎస్ ఆవరణ వద్ద ధర్నా చేస్తున్న అఖిలపక్ష నాయకులు

అనకాపల్లి: స్థానిక గాంధీ కూరగాయలు మార్కెట్ సమీపంలో డీసీఎంఎస్ స్థలంలో రైతులు కూరగాయలు అమ్మకాలు సాగించేందుకు ప్రభుత్వం రైతు బజార్ ఏర్పాటు చేయాలని ఆమ్ ఆద్మీ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కొణతాల హరనాథ్‌బాబు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక డీసీఎంఎస్ ఆవరణలో రైతులతో కలిసి అఖిలపక్ష నేతలు ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ పట్టణంలో రైతు బజారు లేకపోవడంతో గ్రామీణ ప్రాంతాల నుంచి 25 కిలోమీటర్లు నుంచి రైతులు తీసుకొచ్చే కూరగాయలు అమ్మకాలు సాగించేందుకు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ హామీని తక్షణమే అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు, పార్టీ జిల్లా యువ నాయకుడు బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు వైభవంగా నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేసి ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని ఘనంగా జరిపారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

అదృశ్యమైన సాయిసాత్విక్ ఆచూకీ లభ్యం



తప్పిపోయిన సాయిసాత్విక్‌ను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న సీఐ మల్లికార్జునరావు

పరవాడ: కనిపించకుండా పోయిన పరవాడ సినిమాహాలు కూడలికి చెందిన కూండ్రపు సాయిసాత్విక్ ఆచూకీ లభ్యమైందని పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు చెప్పారు. కూడలిలో నివాసం ఉంటున్న కూండ్రపు సత్యారావు కుమారుడు కూండ్రపు సాయిసాత్విక్(15) పదో తరగతి చదువుతున్నాడు. తల్లిదండ్రుల మీద అలిగి శనివారం మధ్యాహ్నం ఇంటి నుంచి పారిపోయాడు. దీంతో తండ్రి సత్యారావు పరవాడ పోలీసులను ఆశ్రయించాడు. వెంటనే రంగంలోకి దిగిన పరవాడ పోలీసులు సీసీ కెమెరా ఫుటేజీ ఆధారంగా అతి తక్కువ సమయంలో సాయిసాత్విక్‌ను ఆచూకీని స్టీల్‌ప్లాంట్ ఉక్కు క్లబ్ వద్ద కనుగొన్నారు. హాస్టల్‌లో ఉండటం ఇష్టం లేక ఇంటి నుంచి పారిపోయినట్లు సాయిసాత్విక్ వెల్లడించాడని దీనిపై విద్యార్థికి కౌన్సెలింగ్ ఇచ్చి శనివారం రాత్రి తల్లిదండ్రులకు అప్పగించినట్లు సీఐ తెలిపారు. గంటల వ్యవధిలో తప్పిపోయిన విద్యార్థి ఆచూకీని కనుగొని తల్లిదండ్రులకు అప్పగించిన పరవాడ పోలీసులను గ్రామస్తులు అభినందించారు.

గోరింటాకు విశిష్టతపై అవగాహన

పరవాడ: సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆషాఢమాసంలో గోరింటాకు విశిష్టతపై ఫౌండేషన్ సభ్యులు విస్తృత ప్రచారం నిర్వహించారు. కూర్మన్నపాలెంలో ఎంవీఆర్ అపార్ట్‌మెంట్‌లో వేంకటేశ్వర దేవాలయం కేంద్రంగా ఫౌండేషన్ మహిళా విభాగం సభ్యులు గోరింటాకు విశిష్టతపై ఆదివారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ కన్వీనర్ పెదపాటి కృష్ణవేణి మాట్లాడుతూ దేవాలయం కేంద్రంగా భజన, సత్సంగం, పౌర్ణమికి సామూహిక హారతి, ఆత్మీయ బంధువులను కలవడం వంటి విషయాలను తెలియజేశారు. ఆషాఢ మాసంలో గోరింటాకు పెట్టుకోవడం వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో ఎస్.కుమారి, ఎం.సుశీల, ఎస్.లక్ష్మి, పి.రామచంద్రరావు, పరవాడ సబ్ డివిజన్ ధర్మ ప్రచారక్ వెన్నల అప్పలనాయుడు పాల్గొన్నారు.

సంతోషిమాతకు ప్రత్యేక పూజలు



మూల విరాట్‌కు పంచామృత అభిషేకాలు చేస్తున్న ఆలయ అర్చకులు

అనకాపల్లి: దేవదాయ శాఖ ఆధ్వర్యంలో స్థానిక గవరపాలెం సంతోషిమాత దేవస్థానంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు, ఆలయ చైర్మన్ మారిశెట్టి భాస్కర్‌రావు దంపతులు ఆదివారం ఇక్కడ అమ్మవారి మూలవిరాట్‌కు పాలు, పంచదార, తేనె పసుపు కుంకుమలతో అభిషేకం నిర్వహించారు. అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో బి.మురళీకృష్ణ, ప్రధాన అర్చకుడు కామేశ్వరరావుశర్మ, ధర్మకర్తలు ఆళ్ల రవికుమార్, బుద్ధ ఈశ్వరరావు, పొలిమేర సన్యాసినాయుడు, పీలా రాజేష్, కర్రి మణి, తదితరులు పాల్గొన్నారు.

చికెన్‌తో పోటీపడుతున్న ఆగాకరకాయ

- చికెన్ కేజీ రూ.172.. ఆగాకర రూ.160



ఆగాకరకాయ

అనకాపల్లి టౌన్: కాలానుగుణంగా లభించే కాయగూరలలో ఆగాకరకాయ ఒక్కటి. దీనిలో పోషకాలు ఎక్కువగా ఉంటాయి. దీనికితోడు రుచికరంగా ఉండటంతో శాకాహార, మాంసాహార ప్రియులు ఎక్కువగా తినడానికి ఇష్టపడతారు. మార్కెట్లో దీని ధర మాత్రం చికెన్‌తో పోటీ పడుతోంది. ఆదివారం అనకాపల్లి మార్కెట్‌లో స్కిన్ చికెన్ కేజీ రూ.172 ఉండగా, ఆకారకాయ రూ.160 పలికింది. ఏటా వర్షాకాలంలో నెల నెలన్నర రోజులు మాత్రమే ఇది మార్కెట్‌కు వస్తుంది. ఈ సీజన్‌లో ఒక్కసారైనా ఈ కాయగూరను తినాలని, దీనిలో మలబద్ధకం, ఉబ్బరం వంటి సమస్యలను తగ్గిస్తుందని, రక్తప్రసరణ అదుపులో ఉంచుతుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. మన జిల్లాలో ఎక్కువగా ఆగాకర పంట గొలుగొండలో పండిస్తుంటారు.

తైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



ప్రచారం చేస్తున్న త్రైత సిద్ధాంత ప్రబోధ సమితి ప్రతినిధులు

పెందుర్తి: త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సరిపల్లిలో త్రైత సిద్ధాంత భగవద్గీతపై ఆదివారం విస్తృత ప్రచారం చేశారు. సమితి ప్రతినిధులు ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. కె.త్రినాథరావు, బి.పైడన్న, సన్యాసి, లక్ష్మీభవాని, అచ్చియ్యమ్మ, రాజు తదితరులు పాల్గొన్నారు.

అధిక లోడ్ వాహనాలను నియంత్రించాలి

జి. భీమవరంలో వంతెనను పరిశీలించిన స్పీకర్ అయ్యన్నపాత్రుడు



వంతెనను పరిశీలిస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

కశింకోట: వంతెనలు, రోడ్లపై పరిమితికి మించిన లోడ్‌తో భారీ వాహనాలు తిరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆదేశించారు. మండలంలోని తాళ్లపాలెం నుంచి నర్సీపట్నం వైపు వెళ్లే మార్గంలో జి. భీమవరం వద్ద మామిడివాక గెడ్డపై మరమ్మతులకు గురై బలహీనంగా ఉన్న వంతెనను ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణతో కలిసి ఆయన ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొంతకాలంగా మాకవరపాలెం వద్ద అన్‌రాక్ సహా పలు పరిశ్రమలకు చెందిన భారీ వాహనాల పరిమితికి మించి లోడ్ దాటికి జి. భీమవరం వద్ద వంతెన దెబ్బతిందన్నారు. దీనిపై పలుమార్లు హెచ్చరించినప్పటి పరిశ్రమల నిర్వాహకులు పట్టించుకోవడం లేదన్నారు. రానున్న కొద్ది రోజుల్లో కలెక్టర్ ఆధ్వర్యంలో వివిధ శాఖల ఉన్నతాధికారులు, పరిశ్రమల నిర్వాహకులతో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. వంతెన పరిస్థితిపై వారం రోజుల్లోగా సాంకేతిక నివేదిక ఇవ్వాలని ఆర్‌అండ్‌బీ అధికారులను ఈ సందర్భంగా ఆదేశించారు. నివేదికను అనుసరించి ఇదే వంతెనకు మరమ్మతులు చేపట్టాలా? లేక కొత్త వంతెన నిర్మించాలా? అనే విషయాన్ని నిర్ణయిస్తామన్నారు. కొత్త వంతెనకు రూ.పది కోట్లు పైబడి ఖర్చు కాగలదని అధికారులు పేర్కొంటున్నారన్నారు. ఎమ్మెల్యే కొణతాల మాట్లాడుతూ భారీ వాహనాలను ఈ వంతెనపై రాకుండా ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా మళ్లించాలన్నారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవిందసత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగజగదీశ్వరరావు, తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి గొంతిన శ్రీనివాసరావు, టీడీపీ మండలాధ్యక్షుడు కాయల మురళీధర్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఆకుకూరలతో మెరుగైన కంటి చూపు



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న దంతులూరి దిలీప్‌కుమార్

తుమ్మపాల: మెరుగైన కంటి చూపు కోసం ఆకుకూరలతోపాటు సరైన నిద్ర అవసరమని డాక్టర్ అరుణ తెలిపారు. చూపు మందగిస్తున్న వృద్ధులకు ఉచితంగా ఆపరేషన్ చేసి కళ్లద్దాలు అందిస్తామన్నారు. మండలంలోని తుమ్మపాలలో పోలిపల్లెమ్మ ఆలయం వద్ద వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో శంకర్ ఫౌండేషన్ సహకారంతో ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్ ప్రారంభించారు. గ్రామంలో కంటి చూపుతో బాధపడుతున్న అనేక మంది వృద్ధులు వైద్య పరీక్షలకు హాజరయ్యారు. వారిలో 50 మందికి పైగా కంటి సమస్యలు ఉన్నవారిని విశాఖలోని శంకర్ ఫౌండేషన్‌కు ఉచితంగా తీసుకెళ్లి ఆపరేషన్ చేస్తామని డాక్టర్ తెలిపారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ సతీష్, వాకర్స్ క్లబ్ ప్రెసిడెంట్ ఎరుబండి సత్యనారాయణ, మహేష్, బాబూరావు, బొడ్డపాటి చినరాజారావు, సర్పంచ్ తట్టా పెంటయ్యనాయుడు పాల్గొన్నారు.

నీటి ఇంజిన్లకు డిమాండ్



కొమరవోలు ఆవ నుంచి ఇంజిన్ సాయంతో నీటిని సేకరించుకుంటున్న రైతులు

రోలుగుంట : మండల రైతాంగం ఖరీఫ్ వరి సాగులో భాగంగా వారి నారుమడుల్లో ప్రభుత్వం రాయితీతో ఇచ్చిన వివిధ రకాల వరి విత్తనాలతో ఆకుపోత పనులు పూర్తి చేసుకున్నారు. ప్రారంభంలో తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు నారుమడులు పచ్చగానే ఉన్నాయి. వారం రోజులు నుంచి ఎండ ప్రభావం ఎక్కువగా ఉండటంతో నారుమడులు ఎండుపోతున్నాయి. దీంతో రైతులు సమీప చెరువుల నుంచి బిందెలు, బకెట్లతో తడుపుతున్నారు. చెరువులు దూరంగా ఉంటే ఇంజిన్లతో నారుమడులు తడుపుతున్నారు. ఇదే అదనుగా ఇంజిను యజమానులు నారుమడికి రూ.300 తీసుకుంటున్నారు. అన్ని గ్రామాల్లో ఒకేసారి ఈ పనులు ప్రారంభం కావడంతో తమ గ్రామాల్లో ఇంజిన్లు లేకుండా పొరుగు గ్రామాలకు వెళ్లి ఇంజిన్లు తెచ్చుకొని నారుమడులు తడుపుతున్నారు. స్థానిక నది చెరువు, కొత్త చెరువు కింద ఆకుమడులను ముద్దు దారాజు, అప్పలనాయుడు వారంలో 120 మంది రైతుల నారుమడులు తడిపారు.